క్లుప్తంగా

'వార్డెన్లపై చర్యలు తీసుకోవాలి'

నిర్మల్: జిల్లాలోని పలు సంక్షేమ వసతిగృహాల వార్డెన్లు.. తమ విధులను నిర్లక్ష్యం చేస్తూ బిట్‌కాయిన్ల వ్యాపారం చేస్తున్నారని ఛాత్ర యువసంఘర్ష సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శీతల్‌కర్ అరవింద్ ఓ ప్రకటనలో ఆరోపించారు. విధులను పక్కనపెట్టి.. విద్యార్థుల ఇబ్బందులను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. మరికొందరు వసతిగృహాల్లో అందుబాటులో ఉండకుండా వ్యాపారంపైనే బయట తిరుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ముగిసిన తాళసప్తాహం



భజనలో పాల్గొన్న భక్తులు

తానూరు: శ్రావణమాసం పురస్కరించుకొని మండల కేంద్రంలోని విఠలేశ్వరస్వామి ఆలయంలో వారం రోజులుగా కొనసాగుతున్న తాళ సప్తాహం శుక్రవారం ముగిసింది. వార్కరి భక్తులు గ్రామంలోని వీధుల్లో భజనలు చేస్తూ ర్యాలీ తీశారు. అనంతరం గ్రామకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు పింటుమహా రాజ్, కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

ఆలయంలో పూజలు

కుంటాల: శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని కుంటాలలోని మహాలక్ష్మి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వామి కదార్ల హరిప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చన,హారతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు.

క్రీడాకారులకు సన్మానం



విద్యార్థులతో ఎస్‌ఓ, సిబ్బంది

సోన్: మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థులు గతంలో జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ అండర్-14,16 విభాగంలో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఇందుకుగాను ఈనెల 29న క్రీడా దినోత్సవం పురస్కరించుకొని కలెక్టర్ అభిలాష అభినవ్ విద్యార్థులను శాలువా, ప్రశంసాపత్రంతో సన్మానించారు. శుక్రవారం కేజీబీవీలో సన్మానం పొందిన విద్యార్థులను ప్రత్యేకాధికారి లతాదేవి, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రియాంక సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామానికి చెందిన గుద్దేటి రాజమణికి రూ.18వేలు, కదం సీతారాం పటేల్‌కు రూ.ఐదు వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆ పార్టీ నాయకులు ఇద్దరికి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సారిక, మాజీ సర్పంచ్ దిగంబర్ పటేల్, బీజేపీ మండల కార్యదర్శి సూర్యవంశీ సాయి, గంగారెడ్డి, రజినీకాంత్ ఉన్నారు.

పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పరిశీలిస్తున్న తహసీల్దార్ సుజాత

కడెం: సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తహసీల్దార్ సుజాత అన్నారు. మండలంలోని కొండుకూర్ గ్రామంలో శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించగా తహసీల్దార్ పరిశీలించారు. అనంతరం గ్రామస్తులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సంతోశ్‌రెడ్డి, కార్యదర్శి అరుణ, అంగన్‌వాడీ టీచర్ గంగామణి, ఆశా వర్కర్ దేవిక తదితరులున్నారు.

'కల్లు డిపో తొలగించాలి'

నర్సాపూర్(జి): తెల్లకల్లు డిపో తొలగించాలని మండలంలోని చాక్‌పల్లి పంచాయతీ పరిధిలోని డొంగుర్‌గాం గ్రామస్తులు శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి నరేశ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. 61వ జాతీయ రహదారి నుంచి డొంగుర్‌గాం వెళ్లే మార్గంలో తెల్ల కల్లు డిపోలో (సెంది డిపో) కల్లు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. సెంది డిపోతో మహిళలు, విద్యార్థులు ఇబ్బందులు కలుగుతాయని పేర్కొన్నారు.

స్పందించిన ఎస్సై..

గ్రామస్తుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించిన ఎస్సై హన్మాండ్లు.. తెల్ల కల్లు బట్టీ తొలగించాలని యజమానికి సూచించారు. బట్టీలో విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈమేరకు ఎక్సైజ్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబల్ రవీందర్‌రెడ్డి ఉన్నారు.

వివాదం పరిష్కరించేందుకు చర్యలు

- పార్డి(కె)లో పర్యటించిన అదనపు కలెక్టర్, భైంసా ఏఎస్పీ



కుభీర్‌లో వివాదానికి కారణమైన స్థలం పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

కుభీర్: మండలంలోని పార్డి(కె) గ్రామంలో ఆరు నెలలుగా నెలకొన్న భూ వివాదం పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, భైంసా ఏఎస్పీ గ్రామానికి వెళ్లి వివాదానికి కారణమైన అంబేద్కర్ విగ్రహం, పక్కన మరియమ్మ(పోచమ్మ) ఆలయ నిర్మాణ స్థలం పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి ఇరుపక్షాల వాదనలు విన్నారు. గ్రామస్తులు తమను సామాజికంగా బహిష్కరిస్తూ వ్యవసాయ పనులకు పిలువడం లేదని ఒకవర్గం వారు అధికారుల ముందు ఆవే దన వ్యక్తం చేశారు. తాము బౌద్ధ ప్రకారం వివాహాలు చేసుకుంటానంటే గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని ఆరోపించారు.

మరోవర్గం వారు మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహం చుట్టూ ప్రహరీ నిర్మిస్తుండటంతో మరియమ్మ విగ్రహం వద్ద పూజలు చేసుకునేందుకు ఇబ్బంది అవుతుంద ని.. హిందూ ధర్మం ప్రకారం పెళ్లి చేసుకుంటే మా కు అభ్యంతరం లేదని తెల్పి చెప్పారు. అధికారులు మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ స్థలం ఉంటే చూపాలని.. బౌద్ధ విధానంలో వివాహాలు చేసుకునేందుకు సదరు స్థలం కేటాయిస్తామని పేర్కొన్నారు. గ్రామస్తులంతా కలిసిమెలిసి ఉండాలని అధికారులు సూచించారు. సమావేశంలో ఆర్డీవో కోమల్‌రెడ్డి, డీపీవో శ్రీనివాస్, డీఎల్‌పీవో సుధాకర్, సీఐ నైలు, తహసీల్దార్ సోము, ఎంపీడీవో మోహన్‌సింగ్, ఎస్సై పి.రవీందర్, పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

బూత్ నుంచి సభ్యత్వ నమోదు చేపట్టాలి



భైంసాలో మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు శ్రీనివాస్



లక్ష్మణచాందలో మాట్లాడుతున్న రాంనాథ్

భైంసాటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ.. ప్రతి బూత్ నుంచి 200 మందిని సభ్యులుగా చేర్చాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్‌ఎస్ కాటన్‌లో మండల స్థాయి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని సూచించారు. సమావేశంలో కార్యక్రమ కోఆర్డినేటర్ సుధాకర్, జిల్లా కో కోఆర్డినేటర్ సుష్మారెడ్డి, మండలాధ్యక్షుడు భూమేష్, బాజీరావు, భీంరావు, అబ్దుల్ రజాక్ తదితరులున్నారు.

లక్ష్మణచాంద: మండలంలో పెద్దఎత్తున బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సభ్యత్వ నమోదుపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలను పార్టీలో స్వచ్ఛందంగా చేర్పించాలని కోరారు. సమావేశంలో బీజేపీ నాయకులు అడ్వాల రమేశ్, భూపాల్‌రెడ్డి,గోవర్ధన్, అల్లూరి రాజు, చంద్రమోహన్‌రెడ్డి, రంజిత్, ముత్యంరెడ్డి, జీవన్‌రెడ్డి, ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పెంబి: వచ్చే నెల 3 నుంచి ప్రారంభమయ్యే బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పండగలా చేపట్టాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఐదు వెంకటేశ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో సభ్యత్వ నమోదుపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో సభ్యత్వ నమోదు మండల కన్వీనర్ బైరెడ్డి రాజేందర్‌రెడ్డి, కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు పుప్పాల రవి, ఎస్సీ మోర్చా మండలాధ్యక్షుడు బాపురావు, బూత్ అధ్యక్షుడు మట్ట రాజబాబు, గోపాల్, మాణిక్‌రావు, సోషల్ మీడియా కన్వీనర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నేడు సభ్యత్వ నమోదుపై కార్యక్రమం

ఖానాపూర్: పట్టణంతోపాటు మండలంలోని గ్రామాల్లో శనివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందని ఆ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు ప్రకాష్, సంతోష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకుడు రితీష్ రాథోడ్, పార్టీ అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, బీజేపీ సభ్యత్వ నమోదు అసెంబ్లీ కన్వీనర్ ఆకుల శ్రీనివాస్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ



బన్సపల్లిలో దరఖాస్తు స్వీకరిస్తున్న అధికారులు



కుంటాల : రైతు కుటుంబంతో సెల్ఫీ తీసుకుంటున్న అధికారి

దిలావర్‌పూర్: అర్హులైనప్పటికీ రుణం మాఫీ కాకపోవడంతో రైతులు వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. శుక్రవారం మండలంలోని బన్సపల్లి రైతువేదికలో ఏవో డి.రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి క్లస్టర్ పరిధిలో రుణ మాఫీ కాని రైతుల అర్జీలను స్వీకరించారు. రేషన్‌కార్డులేని వారిని గుర్తించి కుటుంబ నిర్ధారణ చేశారు. కుటుంబసభ్యుల ఫొటోలు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఏఈవోలు మౌనిక, శ్రావ్య, క్లస్టర్ పరిధిలోని సిర్గాపూర్, బన్సపల్లి, కంజర్, మాయాపూర్, సాంగ్వి, మల్లాపూర్ రైతులు పాల్గొన్నారు.

కుంటాల: రుణమాఫీకి సంబంధించి రేషన్‌కార్డులో పేరు లేనివారు కుటుంబ నిర్ధారణ కోసం అధికారులతో కలిసి రైతు కుటుంబం సెల్ఫీ దిగాల్సి ఉంది. రైతుల రేషన్‌కార్డు, ఆధార్, పట్టాదారు పుస్తకం, బ్యాంక్ ధ్రువీకరణ పత్రాల వివరాలను సమర్పిస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఇందుకోసం కుంటాలలో రైతుల కుటుంబసభ్యులతో వ్యవసాయాధికారులు సెల్ఫీలు దిగారు.

నేడు ముధోల్‌లో..

ముధోల్: రుణమాఫీకి సంబంధించి రేషన్‌కార్డులో పేరు లేని రైతుల వివరాలను శనివారం మండల కేంద్రంలో ఉదయం 10 గంటలకు నమోదు చేయనున్నట్లు ఏఈవో సాయిప్రసాద్ తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన అధ్యాపకులు

భైంసాటౌన్: భైంసా జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బుచ్చయ్య, అధ్యాపకులు మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌రావు పటేల్‌ను శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో కలిశారు. ఉత్తమ అధ్యాపకులుగా స్వాతంత్ర్య వేడుకల్లో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న అధ్యాపకులను మాజీ ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. అనంతరం కళాశాలలో వసతుల కల్పనపై చర్చించారు. అధ్యాపకులు పీజీరెడ్డి, రవికుమార్, పవన్‌కుమార్, రఘునాథ్, సుధాకర్, ఓం ప్రకాశ్ ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు సన్మానం

ఖానాపూర్: ఇటీవల ఆస్ట్రేలియా వెళ్లి అక్కడి ప్రభుత్వం నుంచి ఉత్తమ ప్రజాప్రతినిధి ప్రశంస అందుకున్న ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖా నాయక్‌ను కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్‌నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. మాజీ ఎమ్మెల్యేను ఖానాపూర్‌లోని ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాచమల్ల అశోక్, షమీ, అనిల్, బీబీ సింగ్ తదితరులు ఉన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

బాసర: శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనానికి వచ్చిన ఓ కుటుంబానికి త్రుటిలో ప్రమాదం తప్పింది.శ్రీ వ్యాస మహర్షి ఆలయానికి ఆనుకుని ఉన్న రోడ్డు పక్కన ఓ భక్తుడు కారు పార్కింగ్ చేసి అమ్మవారి దర్శనానికి వెళ్లారు. దీంతో పైనుంచి ఎండిన చెట్టు కొమ్మలు కారుపై పడటంతో కారుఅద్దాలు పగిలిపోయాయి. ఇప్పటికైనా ఆలయ అధికారులు దర్శనానికి వచ్చే వారి వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

భైంసాటౌన్: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బుచ్చయ్య అన్నారు. శుక్రవారం కళాశాల ఆవరణలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, సిబ్బందితో కలిసి వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, వైస్ ప్రిన్సిపాల్ రఘునాథ్, అధ్యాపకులు రవికుమార్, సుధాకర్, పీజీ రెడ్డి, శంకర్, జాదవ్ ఓం ప్రకాష్, మోహన్, సాయినాథ్, విద్యార్థులు, సిబ్బంది ఉన్నారు.

ఆదర్శప్రాయుడు అన్నాభావు సాఠే



తానూరు: జెండా ఆవిష్కరణలో నాయకులు

కుంటాల: ఆదర్శప్రాయుడు అన్నాభావు సాఠే అని భైంసా వ్యవసాయ మార్కెట్ మాజీ డైరెక్టర్ చిలింకర్ గంగాధర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సూర్యాపూర్ గ్రామంలో అన్నాభావు సాఠే జయంతి నిర్వహించారు. వారి చిత్రపటానికి పూలమాలలు వేసి జెండా ఆవిష్కరించారు. పంచాయతీ కార్యదర్శి రాజు, సినీ డైరెక్టర్ కొత్తూర్ శంకర్, మాజీ ఎంపీటీసీ పెద్దింటి పోశెట్టి, సంతోష్, నరేశ్, రాజన్న, డి.మల్లేశ్, కమలాకర్, పోశెట్టి, సాయికిరణ్, మహేశ్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

తానూరు: సాఠే అడుగుజాడల్లో నడవాలని అన్నాభావు క్రాంతి సేనాఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఉత్తం బాలేరావ్ అన్నారు. శుక్రవారం మండలంలోని మసల్గాలో సాఠే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సాఠే విగ్రహానికి నివాళులర్పించి జెండా ఆవిష్కరించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు లచ్చన్న, షాదుల్, మానిక్, షేక్ హుస్సేన్, భుజంగ్ సింగ్, త్రిషరణ్, బాలాజీ తదితరులు ఉన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



ఖానాపూర్: మాట్లాడుతున్న ఎస్సై లింబాద్రి

ఖానాపూర్: ప్రశాంత వాతావరణంలో గణేశ్ నవరాత్రి, దుర్గాదేవి ఉత్సవాలను జరుపుకోవాలని ఎస్సై లింబాద్రి అన్నారు. శుక్రవారం మండలంలోని తర్లపాడ్ గ్రామంలో పండుగల వేళ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ ఫోన్‌కు వచ్చే ఓటీపీలు గుర్తుతెలియని వ్యక్తులకు చెప్పవద్దని, అపరిచితులు పంపే లింక్‌లను ఓపెన్ చేయవద్దని సూచించారు. పెద్ది నర్సయ్య, సంతోష్, రాజేశ్వర్, మహేశ్, తిరుపతి, రత్నం, చిన్నబాపు, భీమయ్య, నాగేశ్, గంగాధర్, తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ముధోల్: అపరిచితుల నుంచి ఫోన్‌కు వచ్చే లింకులను ఓపెన్ చేయొద్దని బాసర ఐఐటీ ఎస్సై పుష్పావతి అన్నారు. మండల కేంద్రంలోని శిశుమందిర్ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆకతాయిలు వేధిస్తే 100కు డయల్ చేయాలన్నారు. మనల్ని మనం రక్షించుకోవాల్సిన విధానం వివరించారు. షీటీం సభ్యులు రాజమణి, ప్రధానాచార్యులు సారథి రాజు, స్వప్న శర్మ తదితరులున్నారు.

అనాథ పిల్లలకు పరామర్శ

నర్సాపూర్(జి): అనాథలుగా మారిన పిల్లలకు భైంసా వివేకానంద ఆవాసం చేయూతనిస్తుందని ఆవాసం ఇన్‌చార్జి లింగారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన గాయత్రి, సాయికిరణ్, అఖిల్‌కుమార్ తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన విషయం విదితమే. వీరిలో మగ పిల్లలకు చేయూతనిచ్చేందుకు వివేకానంద ఆవాసం ముందుకొచ్చింది. శుక్రవారం వివేకానంద ఆవాసం ఇన్‌చార్జి లింగారెడ్డి, ప్రతినిధులు శైలేశ్, నారాయణరెడ్డి, లింగన్న, దామోదర్ నర్సాపూర్(జి)లో పిల్లలను పరామర్శించారు. త్వరలో ఆవాసానికి పిల్లలను తీసుకెళ్తామని పేర్కొన్నారు.

చెన్నూర్ ఎమ్మెల్యేను కలిసిన నేతలు

కడెం: చెన్నూర్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే వివేక్‌ను నేతకాని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గ ంగేశ్, మండలంలోని కొత్తమద్దిపడ గ గ్రామానికి చెందిన ఉపాధ్యక్షుడు దుర్గె వెంకటేశ్ మర్యాద పూర్వకంగా కలిశారు. సెప్టెంబర్ 1న ఉట్నూర్‌లో నిర్వహించే పోలాల అమావాస్య వేడుకలను రావాలని ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా వేడుకలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఇందులో దుర్గయ్య, చంద్రపాల్ తదితరులు ఉన్నారు..

డీఎల్‌పీవో పర్యటన

ఖానాపూర్: మండలంలోని మేడంపల్లి, మస్కాపూర్ గ్రామాల్లో శుక్రవారం నిర్మల్ డీఎల్‌పీవో రమేశ్ పర్యటించారు. మస్కాపూర్‌లో ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా దరఖాస్తు చేసుకున్న ప్లాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆన్‌లైన్ చేయించారు. అనంతరం డ్రై డేలో భాగంగా మేడంపల్లి వెళ్లి పంచాయతీ రికార్డులు, పారిశుధ్య పనులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో రత్నాకర్‌రావు తదితరులు ఉన్నారు.

కాలనీలో సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ చైర్మన్‌తో కాలనీవాసులు

నిర్మల్‌టౌన్: తమ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ సమీపంలో ఉన్న నాగనాయిపేట్ కాలనీవాసులు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఈశ్వర్, కమిషనర్ సీవీఎన్ రాజుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం కాలనీవాసులు మాట్లాడుతూ నాగనాయిపేట్ డబుల్ బెడ్ రూం ఇళ్లకు చెత్త బండి రావడం లేదన్నారు. రోడ్లు గుంతలమయంగా మారడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. కాలనీలో వీధిదీపాలు లేకపోవడంతో ఆ ప్రాంతమంతా చీకటిగా మారిందని..సమస్యలు పరిష్కరించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నవీన్, ఆడుముల్ల పద్మాకర్, కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



పతకాలు, ప్రశంసాపత్రాలతో ఉపాధ్యాయులు

నర్సాపూర్(జి): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం నిర్మల్ ఎన్టీఆర్ మినీస్టేడియంలో కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు జిల్లాస్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. నర్సాపూర్(జి) జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వివిధ పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ పతకాలు, ప్రశంసాపత్రాలను అందుకున్నారు. వీరిలో డి.దేవేందర్ (టేబుల్ టెన్నిస్) చైతన్యరాణి (పరుగు, షాట్‌పుట్, స్పీడ్‌వాకింగ్, వాలీబాల్) రాణి (పరుగు, వాకింగ్, షాట్‌పుట్, చెంచాగోలి, వాలీబాల్) తిరుమల (షాట్‌పుట్, వాలీబాల్) విజయ (వాకింగ్) సాయినాథ్, గంగాధర్ (బ్యాడ్మింటన్) పోటీల్లో పతకాలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. వీరిని వీరిని శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషన్‌రావు, తోటి సిబ్బంది అభినందించారు.

మహిళను కాపాడిన పోలీసులు

బాసర: మండల కేంద్రంలోని గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమైన నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం బొంకన్‌పల్లి గ్రామానికి చెందిన స్రవంతి (27) అనే వివాహితను శుక్రవారం పోలీసులు కాపాడారు. నది వద్ద మెట్లపై స్రవంతి అనుమానాస్పదంగా ఉండటంతో గంగపుత్రులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్సై గణేశ్ ఆదేశాలతో ఏఎస్సై లక్ష్మణ్, హెడ్ కానిస్టేబుల్ వినాయక్, బ్లూ కోట్ సిబ్బంది శ్రీనివాస్ వెళ్లి మహిళను కాపాడారు. స్రవంతికి కౌన్సిలింగ్ నిర్వహించి ఆమెను కుటుంబసభ్యులకు అప్పగించారు.

ప్రజారోగ్యమే ప్రథమ లక్ష్యం

- సొంత నిధులతో భైంసాలో ఐసీయూ ఏర్పాటు చేసిన ముధోల్ ఎమ్మెల్యే
- పుట్టినరోజు సందర్భంగా ఏరియా ఆస్పత్రికి రూ.12లక్షల సామగ్రి విరాళం



భైంసా ఏరియా ఆసుపత్రిలో ఐసీయూ వార్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్ (ఫైల్)

భైంసా: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ప్రథమ లక్ష్యమని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ అన్ని సమావేశాల్లోనూ చెబుతున్నారు. ముధోల్ నియోజకవర్గంలో విద్య, వైద్యంపైనే ప్రత్యేక దృష్టి సారించామని.. తన పుట్టిన రోజును పురస్కరించుకొని వెల్లడించారు. తనకు ఎవరు డబ్బులిచ్చినా తీసుకుని ప్రభుత్వ ఆసుపత్రిలో వారి పేరిట సౌకర్యాలు కల్పించి నిరుపేదలకు సేవలు అందించడంలో అందరిని భాగస్వాముల్ని చేస్తానని పేర్కొన్నారు.

జన్మదిన కానుకగా...

బుధవారం(ఈనెల 28న) తన పుట్టినరోజును పురస్కరించుకొని ఎమ్మెల్యే రామారావుపటేల్ భైంసా ఏరియా ఆసుపత్రిలో ఐసీయూ వార్డును అందుబాటులోకి తీసుకొచ్చారు. అనసూయ పవార్ ట్రస్ట్ తరఫున ఆయన కుమారులు డాక్టర్ సతీశ్‌పవార్, సందీప్‌పవార్ ఏరియా ఆసుపత్రికి రూ.12 లక్షల విలువైన సామగ్రిని విరాళంగా అందించారు. పది ఐసీయూ పడకలు, పది లాకర్లు, పది పారామీటర్లు, 15 సాధారణ పడకలు, పరుపులు, వీల్‌చైర్లు, ఓపీ విభాగంలో 30 మంది కూర్చునేలా కుర్చీలు అందించారు. ఓ గదిలో ప్రత్యేకంగా పది ఐసీయూ పడకలను ఏర్పాటు చేశారు. ఐసీయూ వార్డుకు సంబంధించిన పరికరాలను, పడకలను ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్‌కు అందించారు.

సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా..

నిరంతరం ప్రజాసేవలోనే ఉంటా. నాకు భగవంతుడు అన్నీ ఇచ్చాడు.. నేను ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా. నా జన్మదినం సందర్భంగా భైంసాలో రక్తదానం చేసిన 103 మందికి ధన్యవాదాలు చెబుతున్నా. అనసూయ పవార్ ట్రస్ట్ తరఫున భైంసాలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ఐసీయూ పడకలు, ఇతర సామగ్రి అందించాం. దాతలు, ప్రభుత్వ సహకారంతో ఆసుపత్రిలో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తాను.

– పవార్ రామారావుపటేల్, ముధోల్ ఎమ్మెల్యే

'కళాశాలలపై చర్యలు తీసుకోవాలి'

నిర్మల్‌రూరల్: జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ కళాశాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రెటరీ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు కొట్టురి ప్రవీణ్‌కుమార్ శుక్రవారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొన్ని ప్రైవేట్ కళాశాలల్లో కనీస సౌకర్యాలు లేవని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సంబంధిత కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ సాయిచరణ్, కోకన్వీనర్ జాదవ్ మిథున్, గణేశ్, రామకష్ణ, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. ఆదమరిస్తే అంతే..



లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ నుంచి ధర్మారం వెళ్లే రోడ్డు మార్గంలో పీచరలోని ఎస్సీ కాలనీ వద్ద రోడ్డు కోతకు గురై గుంత ఏర్పడింది. వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఏర్పడిన గుంతను పూడ్చివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి : అంజనేశ్వర్, ఆర్‌అండ్‌బీ ఏఈ ఫోన్: 70210 07310

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిర్మల్

99516 02888
99122 20764

Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

నిర్మల్ మరియు ముధోల్ : జి.గంగాధర్ - 7997958182

టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899